ఈరోజు (14 జూలై) యం.బి.విజ్ఞానకేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సిపిఐ(యం) పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, యం.ఏ.బేబి, గార్లు పాల్గొన్నారు. ఆ వివరాలను ప్రచురణార్థం/ప్రసారార్థం మీకు పంపుతున్నాము. – జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

# రాజ్యాంగ విలువలను దిగజార్చారు
## కేంద్రం, మోడీ తీరుపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఏ.బేబీ
## రాష్ట్రానికి ఏం న్యాయం చేశారని బిజెపికి మద్దతిచ్చారు : బి.వి.రాఘవులు
## విగ్రహాన్ని ఆర్‌ఎస్‌ఎస్ భావజాల నమూనాగా తయారీ
## షరతులు పెట్టి అప్పులిస్తున్నారు
## కేంద్ర నియంతృత్వానికి ఊతమిచ్చిన సుప్రీం బెంచ్ వ్యాఖ్యలు

కేంద్రంలోని ప్రధాని మోడీ రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్నారని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని, పార్లమెంటుపై విగ్రహం ఏర్పాటులో కనీసం ప్రమాణాలు పాటించకుండా పూర్తి నియంతృత్వంగా వ్యవహరించారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఏ.బేబీ అన్నారు. గురువారం విజయవాడలోని ఎంబి విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంటు విగ్రహావిష్కరణ రాజ్యాంగానికి ప్రతినిధి అయిన రాష్ట్రపతి చేయాలని, దానికి అన్ని పక్షాలనూ పిలవాల్సి ఉందని, అలాంటిదేమీ లేకుండా మోడీ ఏకపక్షంగా ప్రారంభోత్సవం చేశారని తెలిపారు. అక్కడ మత క్రతువుల చేయకూడదని తెలిసినా పూజలు చేశారని అన్నారు. రాజ్యాంగానికి ప్రతినిధిగా రాష్ట్రపతి ఉంటారని, ఏ చట్టం చేయాలన్నా ఉభయసభల్లో చర్చించిన తరువాత రాష్ట్రపతి ఆమోదం పొందితే అది చట్టం అవుతుందని తెలిపారు. అలాంటిది రాష్ట్రపతి లేకుండా పార్లమెంటులో విగ్రహావిష్కరణ చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు సింహాల విగ్రహం కూడా గతంలో ఉన్నట్లు లేదని తెలిపారు. సారనాథ్ స్థూపంపై ఉన్న సింహాలు విగ్రహం శాంతి, విజయాలకు చిహ్నంగా ఉండేదని, నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహం దుందుడుకు స్వభావంతో ఉందని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం తాలూకూ సింహాల మాదిరి దీన్ని ఏర్పాటు చేశారని, ఇప్పటికే ప్రముఖులు, రాజకీయ పార్టీల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. పార్లమెంటులో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోల్లో నిజమైన వీరులతోపాటు బ్రిటీషువారికి లొంగిపోయిన వారి ఫొటోలూ ఉన్నాయని, అది సరైన పద్ధతి కాదని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వ నియంతృత్వ విధానాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అన్యాయాలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయడం, బెదిరింపులకు దిగడం కేంద్రానికి అలవాటుగా మారిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర సంస్థలను వ్యక్తులు, సంస్థలపై ప్రయోగిస్తూ లొంగదీసుకునే చర్యలకు దిగుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను బయటపెడుతున్న ఆల్ట్ న్యూస్ ప్రతినిది జుబైర్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టారని, సుప్రీం కోర్టు బెయిలు ఇచ్చినా వేరేకేసు బనాయించి అరెస్టు చేశారని తెలిపారు. అమెరికాలో ఫెయిర్ అనే సంస్థ పరిశోధనల్లో వాస్తవాలను బయటపెట్టి పెద్దపెద్ద మీడియా సంస్థలతోనూ క్షమాపణ చెప్పించిన చరిత్ర ఉందని తెలిపారు. అటువంటి పాత్రను దేశంలో ఆల్ట్ న్యూస్ పోషిస్తోందని తెలిపారు. దేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని తెలిపారు. దురదృష్టవశాత్తూ సుప్రీం కోర్టులో కొన్ని బెంచ్‌లు కూడా కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ నియంతృత్వ విధానాలకు ఊతమిచ్చే విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్నాయని, మొత్తం కోర్టు అలా చేస్తుందని తాను అనడం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గుజరాత్ మత మారణహోమంపై పోరాడుతున్న తీస్తా సెతల్వాద్ కేసు విషయంలో సుప్రీం కోర్టు బెంచ్ చేసిన వ్యాఖ్యానం అందులో భాగమేనన్నారు. దీంతో ఆమె కేసును డిస్మిస్ చేసిన రెండోరోజే అరెస్టు చేశారని తెలిపారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమై పోరాడాలన్నారు. ఈ విషయంలో సిపిఎం తనవంతు పోరాటం చేస్తోందని తెలిపారు. నమ్మకం అనేది వ్యక్తిగతమని, ప్రజలపై ప్రభావం చూపించే సందర్భాల్లో మతాన్ని పక్కనబెట్టి వ్యహరించాలని, తమపరమైన ఆలోచనలతో వ్యవహరించకూడదని ప్రస్తుత బిజెపి పాలకులు దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని

విమర్శించారు. దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి వంటి వ్యక్తి పార్లమెంటులో విగ్రహం ప్రారంభోత్సవంలో పూజలు చేయడం తప్పని అన్నారు. యుపిలో ఒక దేవాలయానికి శంకుస్థాపన చేస్తూ జాతీయ ఆలయమని ప్రకటించడమూ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. నాయకులు చేస్తున్న విధానాలు లౌకికతత్వంతో, ప్రజలందరినీ ఐక్యం చేసే విధంగా ఉండాలని మరోప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి, టిడిపి నిరంతరం ఘర్షణ పడుతున్నా బిజెపి నిలబెట్టిన రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇచ్చే విషయంలో మాత్రం పోటీపడ్డాయని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక విధానం ఉంటుందని, ఈ విషయంలో రెండు పార్టీలూ దాన్ని పక్కబెట్టారని అన్నారు. ముర్ముకు మద్దతు ఇవ్వడం వెనుక సామాజిక న్యాయం అని పైకి చెబుతున్నా ఆచరణలో రాజకీయ విధానానికి ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వలేదని తెలిపారు. హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు తదితర అంశాలపై రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసిందని వైసిపి, టిడిపి రెండూ విమర్శించాయని, ఇప్పుడు ఏం న్యాయం చేశారని మద్దతు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్‌డిఏ, బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అప్పులు పెరిగిపోయాయని బిజెపి నాయకులు విమర్శిస్తున్నారని, దీనికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలే కారణమని అన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాల్లోనూ కేంద్రం జోక్యం చేసుకుని ఫెడరలిజానికి తూట్లు పొడుస్తోందని, నామమాత్రపు స్థాయికి దిగజార్చారని దీన్ని మాత్రం వైసిపి ప్రశ్నించడం లేదని తెలిపారు. రాష్ట్రాల హక్కులను నామమాత్రపు స్థాయికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. గతంలో వేర్వేరు కార్పొరేషన్ల కింద ఉన్న అప్పులనూ చూపించి రాష్ట్రాలు అప్పుల పాలయ్యాని చెబుతోందని, సొంతంగా అప్పులు చేయాలంటే షరతులు పెడుతోందని తెలిపారు. ఆ పేరుతో ప్రజలపై భారాలు మోపుతోందని, విద్యుత్ మీటర్లు, చెత్తపన్ను వంటివన్నీ ఇలాంటివేనని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రాన్ని ఎదిరించాల్సిన వైసిపి, టిడిపి దానికి భజన చేస్తున్నాయని విమర్శించారు. రాజకీయాల్లోనూ, అధికారంలోనూ ఎవరూ శాశ్వతంగా ఉండరని, అలా అనుకున్నవారందరూ ముందుగానే పదవులకు దూరమయ్యారని పేర్కొన్నారు. రాజకీయాల్లో శాశ్వత పదవులంటూ ఏమీ ఉండవని వివరించారు.